

తెల్లని చంద్రుడు; చల్లని వెన్నెల. తెల్లని పూలు; చల్లని గాలి. జాజిపందిరికింద నవారు మంచం; మంచంమీద మనిషి.

ఆ మనిషే కవి అయినట్లయితే తప్పక కవిత్వం అల్లేవాడు; కథకుడైనట్టయితే ఓ శృంగార ఘట్టాన్ని సృష్టించేవాడు; గాయకుడైతే ఒళ్ళు మరిచి గానం చేసేవాడు.

కాని ఆ మంచంమీద చేతులు రెండూ తలకింద పెట్టుకుని వెల్లకిలా పడుకున్నది గోపాలం! మామూలు

# రుజువయింది

( 31 వ పేజీ తరువాయి)

మరింత బాధగా ఉంది.

ఒకళ్లను గురించి ఏమీ తెలియనంతవరకూ వాళ్లను మంచివాళ్లనుకుంటూ, వాళ్లతో మంచిగానే వ్యవహరిస్తాం. కానీ వాళ్లను గురించి చెడ్డగా విన్నప్పుడు మనం హృదయపూర్వకంగా వాళ్లతో పూర్వం మసిలిన విధంగా మసలలేము. ఆ విన్నది అబద్ధం అనికూడా రుజువు దొరికేదాకా నమ్మలేము. వాళ్లను గురించి చెడుగా విన్నప్పుడు, వాళ్లను ఎంతగా ప్రేమిస్తామో అంత బాధపడటం సహజం.

తెల్లారింది.

గోపాలం సాధ్యమైనంతవరకూ మామూలుగా ఉండటానికి ప్రయత్నించాడు. ఆ రోజు సెలవురోజు కావటంచేత గోపాలం పూర్తిగా ఇంట్లోనే ఉండి పోయాడు. సెలవురోజు సాయంత్రం అలా పార్కు వైపుకు షికారు వెళ్లిరావటం వాళ్లకు అలవాటు. సాయంత్రం మామూలుగానే బయలుదేరదామన్నాడు సుశీలతో గోపాలం. 'ఫరవాలేదు. బండి దారిలో



పేద సంసారం —శ్రీ టి. కె. పోతిపేదు

పడుతోంది' అనుకుంది సుశీల. అయితే గోపాలం సుశీలని ఆ రోజు పార్కువైపుకే తీసుకువెళ్ల లేదు. ఎవరో స్నేహితుడింటికని తీసుకువెళ్లాడు. అదేమంటే "వాళ్లుకూడా వస్తారివాళ" అన్నాడు.

ముందు గదిలో పిల్లలు ఆడుకుంటున్నారు. వీళ్లను చూస్తూనే, "డాడీ, ఎవరో వచ్చారు" అంటూ లోపలికి పరిగెత్తుకుపోయారు. అతను వచ్చి గోపాలానికి విష్ చేశాడు. సుశీల ఇల్లంతా కలయజూస్తోంది.

ఇప్పుడే వస్తానని చెప్పి అతను లోపలికి వెళ్లాడు. ఇంతలో గోపాలం ఆల్బమ్ తీసి సుశీలకు ఆ ఫోటో చూపించాడు. సుశీల ఉలిక్కిపడింది. 'తన ఫోటో వీళ్ల ఆల్బమ్‌లోకి ఎలా వచ్చిందా?' అని ఆశ్చర్య పోయింది! దీనికి సమాధాన మేమిటన్నట్లుగా చూశాడు గోపాలం సుశీలవంక.

సుశీలకు అంతా అయోమయంగా ఉంది. పోనీ, ఇతను ఎవరైనా తెలిసినవాడా? అంటే తనకి ఎప్పుడూ చూసినట్లు గుర్తుకూడా లేదాయె! పోనీ, తన ఫోటో ఎవరికైనా స్నేహితురాలికి ఇచ్చిందా అంటే అదీ లేదు! అసలు తను ఆ ఫోటో ఎప్పుడో తీయించుకుంది ఎవరి బలవంతంవల్లనో. తన దగ్గిర అసలు ఆ కాపీయే లేదు! అంతులేని ఆలోచనలతో సతమతమౌతూంది!

ఇంతలో అతను కాఫీ పట్టుకుని వచ్చాడు భార్యతో సహా. కాఫీలు టేబుల్‌మీద పెట్టి, ఆవిణ్ణి గోపాలం సుశీలలకు పరిచయం చేశాడు. నిజానికి అంతవరకూ అతను సుశీలను సరిగ్గా చూడనేలేదు. ఆమెని చూస్తూనే ఆఘాతం తగిలినట్లయి, "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందే?" అన్నాడు తనేమంటున్నాడో తనకే తెలియకుండా.

దానితో సుశీలకు మరింత కంగారు పట్టుకుంది.

అతని భార్య తెల్లబోయి చూస్తోంది.

కాఫీ పొగలు కక్కుతూంది.

గోపాలానికి అరికాలిమంట నెత్తికెక్కుతూంది. ఇక ఉండబట్టలేక అనేశాడు — "నీ చెల్లెలోయ్!"

"చెల్లెలా!" అంది అతని భార్య.

గోపాలం అతని మొహంవంక చూస్తున్నాడు.

అతని మొహం ఒక్కసారిగా వికసించింది. చిరునవ్వు పెదవులమీద తొణికిసలాడింది.

"ఆఁ, అవును. ఇప్పుడు తెలిసింది" అంటూ టేబుల్‌మీద ఉన్న ఫోటో ఆల్బమ్ తీసి భార్యకు చూపించాడు. ఆమెకూడా ఆల్బమ్‌లో ఒకసారి, సుశీలవంక ఒకసారి చూసి ఒక చిరునవ్వు నవ్వింది.

వీళ్లిద్దరి నవ్వుల్నీ అయోమయంగా చూస్తూ కూర్చున్నారు గోపాలం, సుశీల. గోపాలం నిలదొక్కుకోలేకపోతున్నాడు. చేతనైనంత సభ్యతతోనే విషయం తెలుసుకోవాలనుకున్నాడు.

"నీకేం తెలిసిందోకానీ నాకేం అర్థం కావటం లేదు" అన్నాడు తనూ చిరునవ్వు పెదవులమీదికి బలవంతంగా నెట్టుతూ.

"ఏమీలేదు. పెళ్లిచూపులకు రమ్మని రాస్తూ ఒకసారి. ఎవరి దగ్గిరనుంచో ఉత్తరం వచ్చింది ఈ ఫోటోతోపాటుగా. అప్పటికే నాకు ఈ ఏడనో సంబంధం ఖాయం చేసుకోవటంతో నేనసలు చూపులకే వెళ్లలేదు. వాళ్లకు సమాధానం కూడా ఇచ్చినట్లు గుర్తులేదు. ఆ తరవాత పెళ్లి అయిన కొత్తలోనే ఈవిడకి ఫోటో చూపించాను. 'చాలా బాగుందండీ, ఎవరిదీ?' అంది. వివరించి చెప్పాను. 'అలాగా' అంది. 'పోనీ ఫోటో తిరిగి పంపించెయ్యకూడదండీ. మర్యాదగా ఉండదు లేకపోతే' అంది. 'అవును, నిజమే' అనుకుని ఆ మరునాడే ఫోటో పంపించేశాను, 'నా కప్పుడే పెళ్లి అయిపోయిం'దని రాస్తూ. తీరా కొన్నిరోజులకి ఆ కవరు నాకే తిరిగి వచ్చింది 'అడ్రసీ నాట్ ఫౌండ్' అని. ఈవిడ 'పోనీలెండి, ఆల్బమ్‌లో ఉంచుదాము, మన దగ్గిరే ఈ ఫోటో ఉండాలని రాసిఉందేమో. లేకపోతే మీరు మొదట్లోనే పంపించిఉండేవారు' అంది. నేనేమీ అభ్యంతరం పెట్టలేదు. ఇది ఎప్పటి మాట! పదేళ్ల కిందటి మాట! అందుకే నిన్న నువ్వు 'ఈ ఫోటో ఎవరిది?' అని అడగ్గానే ఏం చెప్పాలో తెలీక తత్తరపడ్డాను. సరే. ఇవాళ ఈవిణ్ణి చూశాక 'ఎక్కడో చూసినట్లుంది' అనిపించింది. నువ్వు 'మా చెల్లెలోయ్' అనగానే నేను నిన్న అన్నమాట గుర్తుకు వచ్చింది" అన్నాడు అతను పెద్ద గాథ వివరిస్తూ.

చిక్కుసమస్యను విడదీసినట్లయింది గోపాలానికీ సుశీలకీ. ఇద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

"మా ఆడబిడ్డ కొద్దిగా రావటానికి వీలవక రాలేకపోయాను. ఏదైనా విశేషమా?" అంది ఆవిడ నవ్వుతూ ఎంతో కలుపుగోలుగా. సిగ్గుతో తల వంచుకుంది సుశీల.

గోపాలానికి ఆవిణ్ణి చూస్తే చాలా ఆశ్చర్యం వేసింది. ఆవిడ మనస్తత్వంలో చనవాన్ని పోల్చి చూసుకున్నాడు. సక్కుకీ నాగలోకానికీ ఉన్నంత తేడా కనిపించింది. అక్కడున్నవా రందరిలోకల్లా తను పెద్ద అనుమానం మనిషి అని రుజువయింది. వాళ్లు మానవులు కాదేమోననే అనుమానం కూడా కలిగింది!

"అరే, పూర్తిగా చల్లారిపోయిందే!" అన్నాడు అతను కాఫీకప్పు చేత్తో పట్టుకు చూస్తూ.

"అవును" అనుకున్నాడు గోపాలం.

తన అనుమానాలకు బాగా నొచ్చుకున్నాడు గోపాలం.

"సరే, చివరికి అసలువాళ్లకే చేరిందన్నమాట ఫోటో!" అన్నాడు అతను ఫోటో గోపాలానికి ఇచ్చి వేస్తూ.

ఇవ్వటం ఇష్టం లేనట్లు మొహం పెట్టింది అతని భార్య.

ఈసారైనా తన సభ్యత నిరూపించుకోవాలను కున్నాడు గోపాలం.

"వద్దు! వద్దు! ఇది ఎప్పటికైనా నీ దగ్గిర ఉండవలసిందే! అసలు నీ చెల్లెలే నా దగ్గిర ఉండగా ఈ ఫోటో ఎందుకోయ్ నాకు?" అన్నాడు చమత్కారం మిళాయించి.

అందరి ముఖాలూ చిరునవ్వులతో వెల్లివిరిశాయి. ★